క్లుప్తంగా

ఘనంగా రాజశ్యామల హోమం



గుడివాడ టౌన్: స్థానిక పెద ఎరికపాడులోని భీమేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీ రాజశ్యామల హోమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ హోమంలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) - అనుపమ దంపతులు పాల్గొన్నారు. కొడాలి నానికి విజయం చేకూరాలని ఈ హోమం నిర్వహించినట్లు మండలి హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో కె.ఆంజనేయ ప్రసాద్ - మాధురీలత దంపతులు, మండలి హనుమంతరావు - పద్మావతి దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, శేషగిరిరావు, డీవీఎస్ శ్యామ్ పాల్గొన్నారు.

సిబ్బంది సహకరించాలి



పామర్రు: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతమైన వాతారణంలో నిర్వహించేలా సిబ్బంది సహకరించాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ నరహరసింగ్ అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పోలీసు యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించి, వీటితో పాటు పోలీస్‌పెట్రోలింగ్ సిబ్బందికూడా గస్తీ నిర్వహించనున్నారన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఏర్పాట్లపై పోలింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి బూసి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దత్తభక్తుల ఆధ్వర్యంలో షేర్ యువర్ ఫుడ్



నాగాయలంక: దత్త హ్యూమన్ సర్వీసు వలంటీర్లు, మండల దత్త భక్త బృందం ఆధ్వర్యంలో షేర్ యువర్ ఫుడ్, అన్నసేవ-సచ్చిదానందసేవ కార్యక్రమం పేరుతో నాగాయలంక ప్రధాన కూడలిలో ఆదివారం బాటసారులకు 200 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. మైసూరు దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానాంద స్వామీజీ మాతృమూర్తి జయలక్ష్మి మాత జన్మదినోత్సవం పురస్కరించుకుని మండల దత్త భక్తుల ఆర్థిక సౌజన్యంతో కార్యక్రమం జరిపారు. తొలుత దత్త సేవకురాలు తుంగల సీతా మహలక్ష్మి మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చిట్టా సాంబశివరావు, శివ నాగేశ్వరరావు, అన్నపూర్ణయ్య, చిట్టా శేఖర్, దత్త వలంటీర్లు, వాసవీ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం


పామర్రు నుంచి ఎన్నికల విధులకు వెళుతున్న సిబ్బంది

పామర్రు: నియోజకవర్గంలో సోమవారం నిర్వహించే ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూసి శ్రీదేవి పేర్కొన్నారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 238 పోలింగ్ కేంద్రాలకు 238 ఈవీఎంలతో పాటు 20 శాతం ఎక్కువ ఈవీఎంలను అందుబాటులో ఉన్నాయన్నారు. వీవీ ప్యాడ్‌లు కూడా 30 శాతం అధికంగా ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల విధులలో పీఓ, ఏపీఓలు 1,662 మంది వీరికి 20శాతం అదనంగా సిబ్బందిని రిజర్వులో ఉంచామన్నారు. వీరిని ప్రత్యేకమైన 60 బస్సులలో సెక్యూరిటీతో సహా నియోజకవర్గంలోని ఆయా పోలింగ్‌బూత్‌లకు పంపించామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 44 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఏవిధమైన ఇబ్బందులు జరుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏఆర్వోలు శ్రీపల్లవి, రాజ్యలక్ష్మి, సీఐ సుబాకర్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో మండలంలోని 54 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఆదివారం సాయంత్రం నాటికి చేరుకున్నారు. మండల పరిధిలో 54 మంది పీఓలు, 54 మంది ఏపీఓలు, 216 మంది ఓపీఓలను కేటాయించారు. అలాగే మండల సెక్టారు అధికారులుగా ఏఓ కే శివప్రసాద్, ఏపీఏ సూరపనేని శ్యామల, ఎంఈఓ జి వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్‌డీ డి.జయప్రకాష్, రూట్ ఆఫీసర్లుగా పామర్తి అజయ్, బి నిర్మల, జి సామ్యూల్, లుక్కా శివనాగులు, సురేంద్రను నియమించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: మండల వ్యాప్తంగా 31,627 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 15,243 మంది పురుషులు, 16,385 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు.

పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చేశారు. ఒక డీఎస్పీ, సీఐ, 50 మంది పోలీసు సిబ్బందితో ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.


పామర్రులో విధులు నిర్వహించే సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్వో శ్రీదేవి


మొవ్వ మండలంలో ఎన్నికల సామగ్రిని తీసుకొస్తున్న సిబ్బంది


పామర్రులో ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ నుంచి తీసుకొస్తున్న సిబ్బంది

ఎన్నికల సామగ్రి పంపిణీ


కైకలూరు ఏఎంసీలో ఎన్నికల విధుల అధికారుల జాబితాను పరిశీలిస్తున్న పరిశీలకుడు రామన్


కైకలూరు ఏఎంసీ వద్ద పోలింగ్ బూత్‌లకు సిద్ధమవుతున్న సిబ్బంది

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సిబ్బందికి ఆదివారం ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. నియోజకవవర్గంలో పోలింగ్ బూత్‌లలో పనిచేసే సిబ్బంది 1,388 మంది ఉన్నారు. వీరుకాక పోలీసులు, పరిశీలకులు, ఎన్ఎస్ఎస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. కై కలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీలో ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆర్వో కె.భాస్కర్, శిక్షణ కలెక్టరు శ్రీపూజ ఏర్పాట్లను పరిశీలించారు. సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఎస్.ఎ.రామన్ పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సిబ్బందికి అల్పాహారం, భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. పోలింగ్ సిబ్బందిని కేంద్రాలకు తరలించేందుకు బస్సుల ఏర్పాటు చేశారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగా ఇన్‌స్ట్రక్టర్ ప్రభాకర్ అన్నారు. ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత యోగ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక విశ్వ గురువు, సైంటిఫిక్ సెయింట్, పూర్ణ గురువులు విశ్వ స్ఫూర్తి అనుగ్రహించిన 'ఆసన ప్రాణాయామ యోగ ప్రక్రియ' (ప్రస్థాన సాధన)లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఇప్పటికి నాలుగు వారాలు పూర్తయిందని చెప్పారు. యోగాను సాధన చేసి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ చెన్నై బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ సుమన్ యోగ సాధన ద్వారా వారి జీవితం ఎలా మారిందో చక్కగా వివరించారు. చార్టర్డ్ అకౌంటెంట్ జయలక్ష్మి తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ శిక్షణలో 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబం ఏపీ ట్రస్టీ చొప్పరపు నారాయణరావు, గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి, గుణశేఖర్ స్ఫూర్తి కుటుంబ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఐదుదు రోజులుగా జరుగుతున్న గంగానమ్మ అమ్మవారు తిరునాళ్ల ఆదివారం శాంతి కల్యాణంతో ముగిసింది. ఉదయం శ్రీ అశ్వర్ధ నాగలింగేశ్వరస్వామి వారికి శాంతి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగానమ్మ ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం వైశాఖ శుద్ధపంచమి జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి వారి జయంతి, శ్రీ రామానుజాచార్య స్వామివారి జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో తిరునాళ్ల ముగిసింది.

కొండలమ్మకు మొక్కుల సమర్పణ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోండి

గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్



గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్‌కు విఘాతం కలిగించాలని ప్రయత్నించే అసాంఘిక శక్తులను ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు మోహరించాయన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా రెండు నెలల ముందుగానే కేంద్ర బలగాలు గుడివాడ నియోజకవర్గానికి రావడంతో ప్రక్రియ అంత సజావుగా జరుగుతుందన్నారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా, పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం ఉండేటట్లు చర్యలు తీసుకున్నామన్నారు. ఎంతటి వారైనా తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. రాజకీయ నాయకులు, ప్రజలు కూడా పోలింగ్ సజావుగా జరిగేలా పోలీసు శాఖకు సహకరించాలన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి


ఆత్కూరులో శంకర జయంతి నిర్వహిస్తున్న భక్తులు


అలంకరణలో ఆది శంకరాచార్యులు

ఉంగుటూరు: మండలంలో ఆత్కూరులో శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో శంకర జయంతిని పురస్కరించుకుని ఆదివారం శివుని అభిషేకం చేశారు. ఆది గురువు శంకరాచార్యుల బోధనలు హిందూ ధర్మానికి నలు దిక్కుల దీపస్తంభాలుగా పనిచేశాయని కొనియాడారు. కొద్దిసేపు వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి, గోపరాజు సత్య పవన్, మామిళ్లపల్లి సుబ్బారావు, యామర్తి వకుళ, స్వర్ణ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామ లింగేశ్వర్వామివారి దేవస్థానంలో ఆదివారం జగద్గురు ఆది శంకరాచార్యులు జయంతి ఘనంగా చేశారు. ఉదయం శ్రీఆదిశంకరచార్యుల వారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం వేద పండితులకు ఘనంగా సన్మానం చేశారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ రామలింగేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత వైభవంగా చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వి.సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దాత, ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

భావదేవరపల్లిలో మోడల్ పోలింగ్ స్టేషన్



మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ సహాయ డెస్క్

నాగాయలంక: సాధారణ ఎన్నికల-2024 ప్రక్రియలో భాగంగా మండలంలోని భావదేవరపల్లిలో సర్వాంగ సుందరంగా ఆధునిక రీతిలో మోడల్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని 231వ పోలింగ్ కేంద్రాన్ని దీనికోసం ఎంచుకున్నారు. ఈ బూత్‌లో 799 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారు. వీరిలో 414 మంది మహిళా ఓటర్లు, 385 మంది పురుషులు ఉన్నారు. ఇక్కడ కేంద్రం ముఖ ద్వారంలో ఓటర్లను ఆహ్వానిస్తూ స్వాగత ద్వారం అమర్చారు. లోపలా బయటా మామిడి తోరణాలు అలంకరించారు. పోలింగ్ బూత్ లోపలా బయటా గ్రీన్ కార్పెట్లు, ఇతర అలంకరణలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఓటర్ సహాయక డెస్క్‌ను ప్రత్యేకంగా పెట్టారు. ఓటర్లలో అవగాహన కల్పించడానికి మండలానికి ఒకటి మోడల్ పోలింగ్ బూత్ కేటాయించినట్లు గ్రామ రెవెన్యూ అధికారి జి.తిరుమలరావు చెప్పారు. మండలంలోని 49పోలింగ్ బూత్‌లలో సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. మండలంలో మొత్తం ఓటర్లు 39,232 మంది కాగా పురుషులు 19,733 మంది, స్త్రీలు 19,499 మంది ఉన్నారు. మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే క్రమంలో విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని 39 పోలింగ్ లొకేషన్స్ పరిధిలో 39 మంది బృందం పోలీస్ స్టాఫ్‌లో ఒక ఏఎస్ఐ, ఎనిమిది మంది కానిస్టేబుళ్లు, 30మంది హోమ్ గార్డులు ఎన్నికల విధుల్లో ఉంటారు. అదనంగా కేంద్ర పోలీసు బలగాలకు చెందిన ఫోర్స్ 16 మంది, సేవల్లో 49మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అయిదు రూట్ మొబైల్స్ ఒక్కో దానిలో ఇద్దరు ఎస్ఐలు, 8మంది పీసీలతో 10మంది చొప్పున బందోబస్త్‌లో ఉంటారు. ఒక సీఐ, ముగ్గురు పీసీలతో ఒక స్ట్రైకింగ్ ఫోర్స్ నిరంతరం తిరుగుతందని ఎస్ఐ వివరించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించిన దృశ్యం

మచిలీపట్నంటౌన్: పేద విద్యార్థులు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని ఆదివెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లారి శెట్టి శ్రీనివాసరావు అన్నారు. పదో తరగతి ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివెలమ కుల విద్యార్థినీ విద్యార్థులు విద్యపైనే దష్టిసారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను ప్రశంసాపత్రాలను అందజేశారు. సంఘ నేతలు పిల్లారి శెట్టి సత్యనారాయణ, సూర్య కుమార్, ఉమామహేశ్వరి, ఈశ్వర్, ఆంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. స్వామివారి పుట్టలో పాలు పోసేందుకు, పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసేందుకు అధిక సమయం వేచి ఉన్నారు. స్వామిని దర్శించుకున్న అనంతరం నాగబంధాల వద్ద పూజలు చేశారు. గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వందలాది మంది రోగులకు గుడివాడ వైద్యురాలు డాక్టర్ గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచిత మందుల పంపిణీ చేశారు.